

12వ నివేదిక మార్చి 21, 2026

# వీధులలో బోధించు బోధకుడు

**పీటర్ -పాపువా న్యూ గినియా**

పీటర్ తన జీవితం యడల దేవునికి గల ప్రణాళిక గురించి తరచుగా ఆలోచిస్తూ ఉండేవాడు.

అతని తల్లిదండ్రులు ఇరువురూ క్రైస్తవులు మరియు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు. వారు ఇద్దరూ అతనికి చిన్నతనం నుండి దేవుని గురించి చెప్పారు మరియు ఎలా ప్రార్థించాలో నేర్పించారు. అయితే, యుక్తవయస్సులో, అతని స్నేహితులు అతనిని దేవుని నుండి దూరపర్చు అలవాట్లకు గురి చేశారు.

తరువాత, పీటర్ పెద్దవాడైనప్పుడు, అతను ఒంటరిగా సముద్ర తీర ప్రాంతంలో నివసించాడు. దేవుడు తనను అక్కడికి ఎందుకు నడిపించాడో అని అతను దేవుడిని ప్రశ్నించడం ప్రారంభించాడు. ఏడు నెలల పాటు , అతను పదే పదే "నా జీవితం యడల మీ ప్రణాళిక ఏమిటి?" అని ప్రార్థించాడు.ఒక శుక్రవారం, పీటర్ ఉపవాసం ఉండి ప్రార్థన చేయాలని నిర్ణయించుకున్నాడు. ఆ రోజు ఆహారం మీద ఆధారపడటానికి బదులుగా, అతను పూర్తిగా దేవునిని వెతకడంపై దృష్టి పెట్టాడు. అతను దేవుని యొద్ద నుండి స్పష్టమైన సమాధానము కోరుకున్నాడు.

సూర్యాస్తమయం సమయంలో, వీధిలో నడుస్తున్న ముగ్గురు యువకులను అతను చూశాడు. వారిని కలుసుకొనుమని ఒక స్వరం తనకు చెప్పినట్లు అనిపించింది. అతను వెంటనే వారిని కలుసుకొని తనను తాను వారికి పరిచయం చేసుకున్నాడు.

"మేము వీధులలో సువార్త బోధించు బోధకులం" అని వారిలో ఒకరు చెప్పారు. వారి పేర్లు థామస్, జార్జ్ మరియు జూనియర్ అని పీటర్ తెలుసుకున్నాడు. వారు సముద్ర తీరప్రాంత పట్టణాలలో సువార్తను పంచుకోవడానికి నడిపించబడిన సువార్తికులు.

పీటర్ వాళ్ళు రోజూ దేవుని వాక్యమును వీధులలో, మార్కెట్ ప్రదేశములో, ప్రేక్షకులు ఎక్కడ దొరికితే అక్కడ ప్రకటించడం గమనించాడు.

శనివారం రాత్రి, పీటర్ మరలా దేవునిని తనపట్ల ఆయనకున్న ప్రణాళికను వెల్లడించమని అడిగాడు. అతను తన బైబిల్ను తన ఛాతీపై పెట్టుకుని నిద్రపోయాడు. కలలో ఒక దేవదూత తన చేయి పట్టుకుని మత్తయి 10వ అధ్యాయాన్ని తెరిచిచూపినట్లు అన్పించింది.

పీటర్ మేల్కొన్నప్పుడు, అతను మత్తయి 10 వ అధ్యాయాన్నితెరచి, శిష్యులు, యేసుక్రీస్తును అనుసరించాలని నిర్ణయించుకున్న తర్వాత వారి ద్వారా ఆయన చేసిన అద్భుతమైన విషయాల గురించి చదివాడు.

పీటర్ మత్తయి 10వ అధ్యాయాన్ని ఒక్కసారి మాత్రమే చదివి ముగించలేదు. అతను దానిని మరలామరలా చదివాడు. అప్పుడు తాను గతంలో విన్న అదే చిన్న, నిశ్శబ్ద స్వరం "ఇదే మీ కోసం నా ప్రణాళిక" అని చెప్పడం విన్నాడు.దేవుని పిలుపును రూఢిపర్చుకున్న పీటర్ మోకాళ్లపై పడి, "దేవా, నీవు నన్ను పిలవడానికి నేను ఏ పాటి వాడను? అని ఎలుగెత్తి ఏడ్చాడు.

దేవుని స్పష్టమైన సమాధానానికి అతను కృతజ్ఞతలు తెలిపాడు. మత్తయి 10వ అధ్యాయం

లోని శిష్యుల మాదిరిగానే, యేసును అనుసరించడానికి మరియు పట్టణం నుండి పట్టణానికి వీధి సువార్తికుడిగా ప్రకటించడానికి ఆయన తనను పిలుస్తున్నానని అతడు గ్రహించాడు.

తరువాత కొంతకాలానికే, పీటర్ బాప్తిస్మం తీసుకున్నాడు. మరియు వీధులలో బోధించుచున్న ఆ ముగ్గురు బోధకులకు సహాయకుడిగా అతను వారితో ప్రయాణించాడు, వారి సంచులను మోసాడు మరియు వీధులలో వారితో పాటు బోధించాడు.

ఒక సంవత్సరం తర్వాత, పీటర్ రెండు నెలల శిక్షణా కోర్సుకు హాజరయ్యాడు, ఆ సమయంలో అతను సౌత్ వెస్ట్ పాపువా మిషన్ కోసం ఒక సామాన్యుడిగా సెవెంత్-డే ఎడ్వెంటిస్ట్ చర్చి సిద్ధాంతాలను ఇతరులతో ఎలా పంచుకోవాలో నేర్చుకున్నాడు.

పీటర్ వర్షారణ్యంలోని మారుమూల గ్రామానికి సువార్త పరిచర్య చేయుటకు మొట్టమొదటిగా నియమించబడ్డాడు. ఆ గ్రామం చేరుకోవడానికి అతనికి మూడు రోజులు పట్టింది. అతను భారీ వర్షంలో నడిచాడు, పొదల్లో పడుకున్నాడు మరియు బిస్కెట్లు తిన్నాడు.

వర్షపు దట్టమైన అడవుల్లో, అతను ఒక చిన్న ఎడ్వెంటిస్ట్ చర్చికి చేరుకున్నాడు. సంఘానికి పరిచర్య చేస్తున్న ఒక మధ్య వయస్కురాలైన స్త్రీ, 25 సంవత్సరాలుగా వారి చర్చి కి పాస్టర్ లేడని, పాస్టర్ కొరకు చాలా కాలంగా ప్రార్థిస్తున్నామని చెప్పింది. ఆమె పీటర్ ను " మీరు మాకు సహాయం చేస్తారా?" అని అడిగింది.

పీటర్ అందుకు అంగీకరించి ఒక సంవత్సరం పాటు స్వచ్ఛంద నాయకుడిగా పనిచేశాడు. అక్కడ పరిచర్య చేస్తున్నప్పుడు, అతను తన జీవితంలో దేవుని తదుపరి ప్రణాళిక గురించి ప్రార్థించడం కొనసాగించాడు. ఎడ్వెంటిస్ట్ స్కూల్ ఆఫ్ మినిస్ట్రీకి హాజరు కావాల్సిన సమయం ఆసన్నమైందని అతనికి అనిపించింది.

ఒక శుక్రవారం సాయంత్రం పీటర్ ఇంటికి తిరిగి వచ్చినప్పుడు, తన కోసం వేచి ఉన్న చర్చి సభ్యుడిని చూశాడు. ఆ సభ్యుడు ఎడ్వెంటిస్ట్ స్కూల్ ఆఫ్ మినిస్ట్రీకి, పీటర్ కొరకు ఫీజు చెల్లించినట్లు చూపించే రసీదును అతనికి ఇచ్చాడు. ఆ విధంగా పీటర్ ఒమౌరా లోని ఎడ్వెంటిస్ట్ స్కూల్ ఆఫ్ మినిస్ట్రీకి హాజరయ్యాడు.

ఒమౌరాలో, ఎడ్వెంటిస్ట్ చర్చిలు శారీరకంగా, మానసికంగా మరియు ఆధ్యాత్మికంగా ఎదగడానికి అవసరమైన పీటర్ నైపుణ్యాలను నేర్చుకుంటున్నాడు. సభ్యులు తమను తాము ఎలా పోషించుకోవాలో మరియు వితంతువులు మరియు అనాథలకు ఎలా సహాయం చేయాలో నేర్పించడానికి తోటపని మరియు వడ్రంగిపనిని ఉపయోగించాలని అతను ఎదురు చూస్తున్నాడు. అతను హీబ్రూ తరగతిని కష్టమని భావిస్తాడు కానీ దేవుని సహాయంతో, అతను విజయం సాధించగలడని నమ్ముతాడు. "దేవునితో," అతను "ప్రతిదీ సాధ్యమే" అని అంటున్నాడు. తన తదుపరి నియామకం గురించి అతనికి ఖచ్చితంగా తెలియకపోయినా, పీటర్ తనను ఒమౌరాకు నడిపించిన దేవునిని అనుసరించడానికి కట్టుబడి ఉన్నాడు. "నేను ఎల్లప్పుడూ ఆయన స్వరాన్ని అనుసరిస్తాను."అని చెబుతున్నాడు.

ఈ త్రిమాసం యొక్క పదమూడవ సబ్బాతు కానుకలు, పాపువా న్యూ గినియాలో సువార్తను పంచుకోవడానికి ఒమౌరా ఎడ్వెంటిస్ట్ స్కూల్ ఆఫ్ మినిస్ట్రీ ద్వారా పురుషులు మరియు స్త్రీలను సన్నద్ధం చేయడంలో సహాయపడుతుంది. ధారాళం గా మీరు సమర్పించుచున్న కానుకలను బట్టి మీకు కృతజ్ఞతలు !

గ్రేస్లిన్ లాయిడ్ కి, పీటర్ గివి చెప్పిన సాక్ష్యము